శ్రీకూర్మం ఇన్‌చార్జి ఈవోగా వాసుదేవరావు



గార, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం దేవస్థానం ఇన్‌చార్జి కార్యనిర్వహణాధికారిగా టి.వాసుదేవరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాతపట్నంలోని నీలమణి దుర్గమ్మ ఈవోగా వ్యవహరిస్తున్నారు. ఇంతవరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన కె.నరసింహనాయుడు.. మాతృసంస్థ రాష్ట్ర పురావస్తుశాఖకు వెళ్లిపోయారు. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు స్వీకరించిన వాసుదేవరావును దేవస్థానం అర్చకులు ఆలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

నెలలో సాధ్యమేనా?



ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

- నత్తనడకన వైద్యఆరోగ్యశాఖ భవనాల నిర్మాణం
- నిధులున్నా పనుల్లో జాప్యం
- మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ

శ్రీకాకుళం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో వైద్య సేవలను మెరుగుపరచడమే లక్ష్యంగా చేపట్టిన భవన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వెరసి పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏపీ వైద్య సేవల మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ ఐడీసీ) తాజా నివేదిక పరిశీలిస్తే విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. నివేదికలో ఎక్కడ చూసినా 'పనులు పురోగతిలో ఉన్నాయి.. నెమ్మదిగా జరుగుతున్నాయి' అనే మాటలే కనిపిస్తున్నాయి. అధికారులు చాలా పనులకు ఈ ఏడాది డిసెంబరు 31 నాటికి పూర్తిచేయాలని గడువు విధించారు. కానీ శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రి(రిమ్స్)తోపాటు ఆమదాలవలస, నరసన్నపేట, రాజాం, ఆమదాలవలస తదితర ప్రాంతాల్లో ఆస్పత్రుల్లో ఇప్పటివరకు సగం పనులు కూడా పూర్తికాలేదు. మెడికల్ కాలేజీ మరమ్మతులు, మరుగుదొడ్ల రిపేర్లు, ఓపీ బ్లాక్ రినోవేషను.. ఇలా చాలా పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నెల రోజుల్లో వాటిని ఎలా పూర్తిచేస్తారన్నది ప్రశ్నార్థకమవుతోంది.

పనులన్నీ పూర్తయ్యేదెప్పుడో..?

శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రి(రిమ్స్)లో క్రిటికల్ కేర్ బ్లాక్(సీసీబీ) పనులు 20 శాతమే పూర్తయ్యాయి. పీఎం అభిమ్ నిధులు రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ బ్లాక్ పనుల గడువు ఈ ఏడాది డిసెంబరు 31తో ముగుస్తుంది. కానీ ఇప్పటివరకు ఖర్చు చేసింది కేవలం రూ.4.31 కోట్లు మాత్రమే. ఇంకా సుమారు రూ.19 కోట్ల విలువైన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. నెల రోజుల్లో ఈ భారీ నిర్మాణం ఎలా పూర్తవుతుందో అధికారులే సెలవియ్యాలి.

- నరసన్నపేటలో వంద పడకల ఆసుపత్రి కోసం రూ. 12.60 కోట్లు కేటాయిస్తే.. ఇప్పటికి ఖర్చు చేసింది రూ.6.35కోట్లు మాత్రమే. ఇప్పటివరకు సగం పనులే అయ్యాయి. ఇక విజయనగరం జిల్లా పరిధిలో ఉన్నా.. ఈ డివిజన్ కిందకు వచ్చే రాజాం ఏరియా ఆసుపత్రిలో రూ.6.80 కోట్ల పనులకుగాను ఖర్చు చేసింది రూ.3.18 కోట్లు మాత్రమే.
- మందస, కొత్తూరు, కోటబొమ్మాళి సీహెచ్‌సీల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆమదాలవలస సీహెచ్‌సీ (30 పడకలు) అభివృద్ధి పనులు ప్రస్తుతం జరగడమే లేదు. రూ.2.45కోట్లు మంజూరైతే కేవలం రూ.91 లక్షలు ఖర్చు చేసి చేతులు దులుపుకొన్నారు. ఇక్కడ పనులు నిలిచిపోయినా గడువు మాత్రం డిసెంబరు 31 అని రాసుకోవడం విడ్డూరం.

15సార్లు టెండర్లు పిలిచినా..

కవిటి సీహెచ్‌సీ మరమ్మతుల కోసం రూ.20లక్షలు మంజూరయ్యాయి. దీనికోసం ఇప్పటికి ఏకంగా 15సార్లు టెండర్లు పిలిచారు. అయినా ఒక్క కాంట్రాక్టర్ కూడా ముందుకు రాలేదు. ఈ ఏడాది సెప్టెంబరు 19 నాటికే చివరి గడువు ముగిసినా ఎవరూ టెండర్ వేయలేదు. ఇంత దారుణంగా వ్యవస్థ ఉంటే ప్రజలకు వైద్యం ఎలా అందుతుందనే ప్రశ్న తలెత్తుతోంది. డిసెంబరు 31 నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం విధించిన (మిగతా 7వ పేజీలో..)



కవిటి సామాజిక ఆరోగ్య కేంద్రం

అమ్మో.. ఎయిడ్స్!



- కేసుల సంఖ్య తగ్గినా.. అప్రమత్తంగా ఉండాల్సిందే
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

ఇచ్ఛాపురం/ నరసన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి):

ఒకప్పుడు ప్రపంచాన్ని వణికించిన వైరస్ హెచ్ఐవీ. 1990-2002 మధ్య జిల్లాలో హెచ్ఐవీ కేసుల తీవ్రత అధికంగా ఉండేది. ప్రస్తుతం తగ్గుముఖం పట్టడం ఉపశమనమే అయినా.. ఇంకా కేసులు కొనసాగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో గడిచిన ఐదేళ్లలో హెచ్ఐవీతో మృతి చెందేవారి సంఖ్య గణనీయంగా తగ్గింది. జిల్లాలో మొత్తం 1,768 మంది మృతి చెందగా.. వీరిలో స్త్రీలు 637 మంది, 1,131 మంది పురుషులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఏఆర్టీ కేంద్రాల్లో ప్రభుత్వం ఉచితంగా మందులను పంపిణీ చేయడం. బాధితులకు కౌన్సిలింగ్ ఇవ్వడంతో మరణాల సంఖ్య తగ్గింది. జిల్లాలో ప్రధానంగా వలసలు అధికంగా ఉండడం, ఇతర ప్రాంతాల నుంచి ఎక్కువగా విస్తరిస్తూ వచ్చింది. చాలావరకూ కట్టడి చేయడంలో జిల్లా యంత్రాంగం సఫలమైంది. అవగాహన తోనే ఎక్కువ మంది ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా సెక్స్‌తో పాటు వైద్యసేవల సమయంలో అప్రమత్తంగా ఉంటున్నారు.

వ్యసనాలే కారణం..

ప్రస్తుతం మద్యం మత్తులో యువత చిత్తు అవుతోంది. వ్యసనాల కారణంగా కొంతమంది తప్పటడుగులు వేస్తున్నా రు. ఆపై ఆర్థికపరమైన ఇబ్బందులతో సెక్స్ వర్కర్లు పెరగడం కారణంగా పలువురు హెచ్ఐవీ బారిన పడుతున్నారు. ముఖ్యంగా సెక్స్ పరంగానే ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఒక్కోసారి రక్తం, అవయవ మార్పిడి, అస్తవ్యస్త వైద్య విధానంతో ఈ వైరస్ వ్యాపిస్తోంది. ప్రధానంగా 15 నుంచి 49 సంవత్సరాల్లోపు వారు హెచ్ఐవీ బారిన పడుతు న్నారు. గిరిజన ప్రాంతాల్లో అవగాహన లేక పోవడం, బాధితులపై పర్యవేక్షణ కరువవ్వడం, కేసుల గుర్తింపులో జాప్యం తదితర కారణాల తో ఎక్కువమంది ఆస్పత్రి పాలవుతున్నారు. హెచ్ఐవీ బయటపడితే కుటుంబ పరువు ఎక్కడిపోతుందోనని చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరికొందరు కుటుంబాలకు దూరంగా ఉంటున్నారు. ఇంకొందరు మనోవ్యధకు గురై (మిగతా 7వ పేజీలో..)

జిల్లాలో చికిత్సా కేంద్రాలివీ..

- సమగ్ర సలహా, పరీక్ష కేంద్రాలు, ఐసీటీసీలు- పీపీటీసీటీలు : 15
- పెసిలిటీ ఇంటిగ్రేటెడ్ ఐసీటీసీలు (ప్రాథమిక ఆరోగ్య /పట్టణ కేంద్రాలు : 113
- ఏఆర్టీ కేంద్రాలు: 3 (శ్రీకాకుళంలో జీజీహెచ్, టెక్కలిలో జిల్లా ఆసుపత్రి, రాగోలులో జెమ్స్)
- లింక్ ఏఆర్టీ కేంద్రాలు: 10 (ఇచ్ఛాపురం, సోంపేట, పలాస, నరసన్నపేట, పాతపట్నం, కొత్తూరు, బుడితి, పొందూరు, కోటబొమ్మాళి, రణస్థలం)
- సుఖవ్యాధుల చికిత్సా కేంద్రాలు: జీజీహెచ్- శ్రీకాకుళం, జిల్లా ఆసుపత్రి - టెక్కలి
- రక్తనిధి కేంద్రాలు : 11 (ప్రభుత్వం: 4 ప్రైవేట్: 7)
- టార్గెట్ ఇంటర్ వెన్షన్ సెంటర్ (స్వచ్ఛంద సేవాసంస్థలు): 3
- లింక్ వర్కర్స్ ప్రాజెక్టు (గ్రామాల్లో): 100
- కేర్ సపోర్టు సెంటర్: 1 (ఎస్ఎన్‌పీ, శ్రీకాకుళం)
- జిల్లాలో క్రమం తప్పకుండా ఏఆర్టీ మందులువాడే వారి సంఖ్య: 19,992 మంది

నేడు అవగాహన ర్యాలీ..

- డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత



అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి డా.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల జంక్షన్, జీటీ రోడ్డు, చిన్నబజార్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అక్కడ నుంచి మళ్లీ ఏడురోడ్ల జంక్షన్ వద్దకు చేరుకుని మానవహారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎయిడ్స్‌పై ప్రజల్లో అపోహలు తొలగించడం, అవగాహన పెంచడం, నివారణ, సంరక్షణ, ఐక్యత సందేశం ఈ ర్యాలీ లక్ష్యమన్నారు.

సంవత్సరం	పరీక్షల సంఖ్య	బాధితులు			మొత్తం	హెచ్ఐవీ శాతం
		పురుషులు	స్త్రీలు	గర్భిణులు		
2022-23	1,23,879	233	207	16	440	0.36
2023-24	1,23,424	267	201	14	472	0.38
2024-25	1,10,241	203	188	15	392	0.36
2025-26 (అక్టోబరు 30 వరకు)	62,906	96	75	7	172	0.27

దిత్వా తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి

- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

శ్రీకాకుళం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్‌పై జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేంద్రపౌర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. సోమవారం నుంచి రాష్ట్రానికి కూడా భారీ వర్షసూచన ఉందని, రైతులు పంటలను కాపాడుకోవాలని సూచించారు. పంట కోతల విషయంలో వ్యవసాయ అధికారులు సూచనలు తీసుకుంటే తక్కువ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. జిల్లాకు ప్రస్తుతానికి వాతావరణ శాఖ నుంచి రెడ్, ఆరెంజ్ అలర్ట్‌లు లేకపోయినప్పటికీ వర్ష సూచనలు స్పష్టంగా ఉన్నాయని తెలిపారు. జిల్లా అధికారులు.. రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం చోరీలు

- ఇద్దరి అరెస్టు
- నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ లక్ష్మణరావు, పోలీసుల అదుపులో నిందితులు

పలాస, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, పేకాట కోసం ముగ్గురు వ్యక్తులు దొంగలుగా మారారు. తాళాలు వేసిన ఇళ్లల్లో దొంగతనాలు చేసేవారు. ద్విచక్ర వాహనాలను సైతం దొంగిలించి.. వాటిని విక్రయించిన డబ్బుతో బెట్టింగ్‌లు ఆడేవారు. పోలీసులు నిఘా వేసి ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కాశీబుగ్గ డీఎస్పీ లక్ష్మణరావు ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ఎచ్చెర్ల మండలం దుప్పలవలస గ్రామానికి చెందిన బూసర లక్ష్మణరావు, గుజరాతీపేటకు చెందిన పింద్రాల చిన్నతోపాటు మరో వ్యక్తి ఈ ఏడాది అక్టోబరులో కాశీబుగ్గ మోర్ సెంటరు వద్ద మోటారు వాహనం, ఆంధ్రాబ్యాంకు వీధిలో మరో వాహనం, శ్రీనివాసనగర్ చిన్నతిరుమల ఆలయం వద్ద ద్విచక్రవాహనం, కాశీబుగ్గ బస్టాండు వద్ద అన్నక్యాంటీన్ వద్ద దిచక్రవాహనాలు దొంగిలించి పరారీ అయ్యారు. అలాగే శ్రీకాకుళం పీఎన్ కాలనీలో తాళాలు వేసిన ఇంట్లోకి చొరబడి ఐదు తులాల వెండి పట్టీలను దొంగిలించారు. బొబ్బిలి వెలమవారివీధిలో ఓ ఇంటిలో ప్రవేశించి 12 తులాల బంగారం ఆభరణాలు, వెండి వస్తువులు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం లక్ష్మణరావు, చిన్న ద్విచక్ర వాహనంపై పలాస (మిగతా 8వ పేజీలో..)

పడవ బోల్తా పడి..

- మత్స్యకారుడి మృతి



తోటయ్య (ఫైల్)

శ్రీకాకుళం రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పడవ బోల్తా పడి మత్స్యకారుడు మృతి చెందిన సంఘటన శ్రీకాకుళం మండలం పెద్ద గనగళ్లవానిపేట తీరంలో ఆదివారం చోటుచేసుకుంది. పెద్ద గనగళ్లవానిపేట పంచాయతీ పుక్కళ్లపేటకు చెందిన తోటయ్య(55).. మరో ముగ్గురు మత్స్యకారులతో కలిసి ఆదివారం ఉదయం సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. అలల ఉధృతి పడవ బోల్తా పడగా వారంతా గల్లంతయ్యారు. ముగ్గురు ఒడ్డుకు చేరుకోగా, గనగళ్ల తోటయ్య సముద్రంలో మునిగి మృతి చెందాడు. మృతదేహాన్ని తోటి మత్స్యకారులు ఒడ్డుకు చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు విలపించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుని భార్య గనగళ్ల నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

- మత్స్యకారుడు తోటయ్య మృతిపై మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు విచారం వ్యక్తం చేశారు. మత్స్యకారుడి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. భవిష్యత్‌లో మత్స్యకారులు ఇటువంటి ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని మత్స్యశాఖ అధికారులను ఆదేశించారు.



పోలీసుల అదుపులో బంగ్లాదేశ మత్స్యకారులు (కింద కూర్చొన్న వ్యక్తులు)

దారి తప్పిన బంగ్లాదేశీయులు

- మూసవానిపేట తీరానికి చేరిన 13 మంది
- గుర్తించిన స్థానిక మత్స్యకారులు
- కళింగపట్నం మెరైన్‌స్టేషన్‌కు తరలింపు
- పోలీసు కేసు నమోదు

ఎచ్చెర్ల, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వారంతా బంగ్లాదేశ్‌కు చెందిన మత్స్యకారులు. కొద్దిరోజుల కిందట 13 మంది సముద్రంలో చేపలవేటకు వెళ్లారు. సముద్రంలో వాతావరణం అనుకూలించకపోవడం.. మరోవైపు బోటు పాడైపోవడంతో దారి తప్పి.. ఎచ్చెర్ల మండలం బడివానిపేట పంచాయతీ మూసవానిపేట సముద్రతీరానికి (మిగతా 7వ పేజీలో..)

2008 లోనూ..

2008లో ఒకసారి బంగ్లాదేశ్‌కు చెందిన మత్స్యకారులు బోటు పాడైన కారణంగా ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం సముద్ర తీరానికి చేరారు. తాజాగా మరోసారి ఈ సంఘటన చోటుచేసుకుంది.

తాళ్లవలసలో డయేరియా

- ఒకరి మృతి.. మరో ఐదుగురికి అస్వస్థత

సంతబొమ్మాళి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం తాళ్లవలసలో డయేరియా విజృంభిస్తోంది. ఈ వ్యాధి బారిన పడి గ్రామానికి చెందిన మార్పు చిన్నారావు(65)ఆదివారం మృతి చెందాడు. గ్రామంలో చిన్నారావుతోపాటు గున్న రుద్రమ్మ, చల్లరాములు, సీపాన బుడ్డు, గున్న పాపారావు, మరొకరు శనివారం రాత్రి నుంచి విరోచనాలు, వాంతులతో బాధపడుతున్నారు. చికిత్స కోసం టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేరారు. చికిత్స పొందుతూ చిన్నారావు ఆసుపత్రిలోనే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారంతా రోదించారు. అలాగే డయేరియా వ్యాప్తి నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేష్ ఆధ్వర్యంలో తాగునీటి పరీక్షలు నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు.

మద్యం సేవించి హల్‌చల్ చేస్తే కఠిన చర్యలు
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

7లో

ఇంద్ర ఏసీ బస్సు చార్జీల తగ్గింపు
- శ్రీకాకుళం నుంచి విజయవాడ ప్రయాణికులకు అవకాశం



సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి అచ్చెన్న

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజాదర్బార్
- వైసీపీ పాలనలో పంచాయతీలు అధ్వానం
- మంత్రి అచ్చెన్న

8లో

నెలలో సాధ్యమేనా?

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్లను పరుగులు పెట్టించడంలో విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

గడువులోగా కష్టమే..

గడువులోగా ఈ నెలాఖరు నాటికి కొన్ని భవనాలు పూర్తవ్వడం కష్టమే. నాబార్డు ద్వారా చేపడుతున్న పనులను నాగార్జున కన్‌స్ట్రక్షన్స్ చూస్తోంది. ఇవి సుమారు ఐదేళ్ల నుంచి పనులు జరుగుతున్నాయి. బిల్లుల సమస్య లేకపోయినా నెమ్మదిగా పనులు సాగుతున్నాయి. నర్సింగ్ కళాశాల హాస్టల్ భవనాల పనులు ప్రారంభించాం. రిమ్స్ క్రిటికల్ కేర్ యూనిట్, సెకెండరీ హెల్త్ డైరెక్టర్ మెయింటెన్స్ గ్రాంట్ కింద మంజూరైన పనులు పూర్తిచేయిస్తాం. ఇక కవిటికి మాత్రం టెండర్ వేసేందుకు ఎవరూ రావడం లేదు.

-సిమ్మ సిమ్మన్న, ఈఈ(ఎఫ్ఏసీ), ఏపీఎంఎస్ఐడీసీ

అమ్మో.. ఎయిడ్స్!

(ఐదో పేజీ తరువాయి)

మరింత కృంగిపోయి మరణిస్తున్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ తీవ్రతను తగ్గించే చాలా రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం అందుబాటులో ఉన్నాయి. 2008 నుంచి ఏఆర్టీ (యాంటీ రెట్రోవైరల్ థెరపీ ద్వారా)మందులు ఇస్తున్నారు. బాధితులకు నెలకు రూ.2,250 చొప్పున పింఛన్ కూడా అందుతోంది.

అవగాహన పెంచుతున్నాం..



జిల్లాలో ఎయిడ్స్‌ను సమూల నిర్మూలనకు కృషి చేస్తున్నాం. పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. హెచ్ఐవీ వైరస్ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. సకాలంలో మందులు అందిస్తే చాలా ప్రయోజనం. కలెక్టర్, వైద్యఆరోగ్యశాఖ, ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సహకారంతో ప్రజలకు విస్తృతంగా హెచ్ఐవీ నివారణపై అవగాహన కల్పిస్తున్నాం. గర్భిణుల నుంచి పిల్లలకు ఎట్టి పరిస్థితిలో వ్యాధి సోకకుండా కట్టడి చేస్తున్నాం.

-డాక్టర్ టి.శ్రీకాంత్,
జిల్లా ఎయిడ్స్ నియంత్రణాధికారి, శ్రీకాకుళం

మనోధైర్యం కల్పిస్తున్నాం..



హెచ్ఐవీ వ్యాప్తి చెందకుండా బాధితులకు కౌన్సిలింగ్, అవగాహన ద్వారా మనోధైర్యం కల్పిస్తున్నాం. ఏఆర్టీ కేంద్రాల వద్ద మందులను అందజేస్తున్నాం. వైద్యుల సూచన మేరకు క్రమం తప్పకుండా మందులు వాడితే ప్రాణనష్టం ఉండదు.

-రెడ్డి భార్గవ్, ఎండీ, ఏఆర్టీ వైద్యులు,
నరసన్నపేట, సామాజిక ఆసుపత్రి

దారి తప్పిన బంగ్లాదేశీయులు

(ఐదో పేజీ తరువాయి)

ఆదివారం చేరారు. పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్ర సరిహద్దుల మీదుగా బడివానిపేట పంచాయతీ మూసవానిపేట తీరం వద్ద సముద్రంలో బోటు లంగరు వేసి ఉండిపోయారు. బోటు నడిపేందుకు ఇంధనం లేక, తినేందుకు ఆహారం లేక ఇబ్బందులు పడ్డారు. వారిని ఆదివారం మధ్యాహ్నం స్థానిక మత్స్యకారులు గమనించారు. బోటు ఈ ప్రాంతానికి చెందినది కాదని, బోటులో ఉన్నవాళ్లంతా అనుమానితు లుగా ఉన్నట్టు భావించి స్థానిక, మెరైన్ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందజేశారు. కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు, ఎచ్చెర్ల ఎస్ఐ జి.లక్ష్మణరావు, సిబ్బంది సముద్ర తీరానికి చేరుకుని మూడు బోట్ల సాయంతో సముద్రంలోకి వెళ్లి వారిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ఆ మత్స్యకారుల వేషధారణ, భాష ఆధారంగా వారంతా బంగ్లాదేశీ యులుగా గుర్తించారు.

భాష తెలియక.. బిక్కుబిక్కుమంటూ..

స్థానిక మత్స్యకారులు, పోలీసులు వారితో మాట్లాడేందుకు ప్రయత్నించినప్పటికీ కొద్దిరోజులుగా ఆహారం లేకపోవడం, భయంతో వివరాలు చెప్పేందుకు ఇబ్బంది పడ్డారు. కొద్దోగొప్పో బంగ్లాదేశ్ భాష తెలిసిన స్థానిక మత్స్యకారులు వారితో మాట్లాడితే కొద్ది సమాచారం మాత్రమే తెలిసింది. సాజ్విక్, జహంగీర్, షబీర్, కోకాన్, మాక్సుద్, మాలిక్, మాక్సుద్, ఎండీ ఫరూఖ్, నశీర్, హెల్లాల్, ఫరూఖ్, అలామ్, షమీర్ తమ పేర్లు అని వెల్లడించారు. వారం రోజులుగా భోజనం లేదని, సముద్రంలో బోటు ఎటు వెళ్తుందో తెలియని పరిస్థితిలో వారంతా బిక్కు బిక్కుమంటూ మాట్లాడారు. సుమారు 15 రోజులుగా సముద్రంలో ఉం డడం, బంగాళాఖాతంలో వాతావరణ పరిస్థితి అనుకూలించక పోవ డంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వీరు ఒడ్డుకు చేరిన వెంటనే స్థానిక మత్స్యకారులు వేడిని కాచుకునేందుకు మంటలు వేశారు. అలాగే ముందుగా బిస్కెట్లు అందించారు. ఆ తర్వాత భోజనాలు ఏర్పాటు చేశారు. వారిని కళింగపట్నం మెరైన్ స్టేషన్‌కు తరలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇక్కడికి చేరిన బంగ్లాదేశీయులపై 81, 82 ఇండియన్ మారిటైమ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేస్తున్నట్టు మెరైన్ సీఐ ప్రసాదరావు తెలిపారు.

ఘనంగా నరసింహ స్వామి యజ్ఞం

రణస్థలం, నవం బరు 30 (ఆంధ్రజ్యోతి): కోష్ట గ్రామం, బంటుపల్లి రెవెన్యూ పరిధిలోని ఎస్‌కేసీఎం గో సేవ ఆశ్రమంలో త్రిదండి స్వామి ఆధ్వర్యంలో ఆదివారం ప్రహ్లాద వరద నర సింహ స్వామి యజ్ఞం నిర్వహించారు. లోక కల్యాణార్థం చేపట్టిన ఈ యాగం ప్రతీనెల చివరి శనివారం నిర్వహించడం ఆనవాయితీ. భగవన్నామజపం, సంకీర్తన అద్భుతంగా చేశారు. మధ్యాహ్నం మహా ప్రసాద వితరణ చేపట్టారు.

గురజాడకు ఘన నివాళి

అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సుప్ర సిద్ధ గేయ రచయిత గుర జాడ అప్పారావు 111వ వర్ధంతి సందర్భంగా ఆదివారం పలువురు కవులు ఘన నివాళి అర్పించారు. స్థానిక శాంతినగర్ కాలనీ లోని గాంధీ మందిరంలో తెలుగు రచయితల వేదిక, సాహితీ చైతన్య కిరణాలు సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం గురజాడ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళావేదిక అధ్యక్షుడు బి.ఉమామహేష్ ఆధ్వర్యంలో గురజాడ గేయ సంకలనాన్ని ఆవిష్కరించారు. తెరవే సభ్యులు ఆర్.వెంకటరమణమూర్తి, నిక్కు అప్పన్న, రాజారావు పాల్గొన్నారు.

మద్యం సేవించి హల్‌చల్ చేస్తే కఠిన చర్యలు

● ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి



శ్రీకాకుళం క్రైం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలి పారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో రహదారి భద్రత, ప్రమాదాల తగ్గించడం, ప్రజలకు ఇబ్బంది కలిగించేలా బహిరంగ మద్యం సేవించడం, పబ్లిక్ న్యూ సెన్స్ అరికట్టేందుకు పోలీసుల తనిఖీలు, వివిధ కేసుల్లో కోర్టులు శిక్షలు, జరిమానాలు విధిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 17,509 వేల డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసులు నమోదు కాగా, వీటిలో 8,594 వేలకు పైగా కేసుల్లో కోర్టుల ద్వారా శిక్షలు, జరిమానా రూపంలో డిస్పోజ్ అయ్యాయన్నారు. మద్యం సేవించి వాహనం నడపడం వల్ల అనేక ప్రాణ నష్టం కలిగించే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రతిరోజు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు కొనసాగుతున్నాయన్నారు. ప్రజల ప్రాణాల భద్రత కోసం ట్రాఫిక్ నిబం ధనలు కచ్చితంగా పాటించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, లేదా బహిరంగంగా మద్యం సేవిస్తే ఎటువంటి మినహాయింపు లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కోర్టులు విధించిన శిక్షలు, జరిమానాలిలా..

డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ కేసుల్లో 28 మందికి శిక్షలు, 113 మందికి జరిమానా విధించినట్టు తెలిపారు. శిక్షల్లో 60 రోజులకు ఒక కేసు, 45 రోజులకు ఒక కేసు, 30 రోజులకు 8 కేసులు, 20 కేసులకు నాలుగు కేసులు, పది రోజులకు రెండు కేసులు, ఏడు రోజులకు 11 కేసులు, రెండు రోజులకు ఒక కేసు మొత్తం 28 కేసులు అమలు జరిగాయన్నారు. జరిమానాల ప్రకారం 113 కేసుల్లో రూ.10 వేలు చొప్పున జరిమానాలు విధించారన్నారు.

కోర్టుల ద్వారా ఇప్పటివరకు 8,594 వేల కేసుల్లో మొత్తం సుమారు రూ.38 లక్షల జరిమానాలు వేసినట్టు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

సంగీత అధ్యాపకురాలికి డాక్టరేట్



యామినీ కృష్ణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం సంగీత అధ్యాపకురాలు కరి యామినీకృష్ణకు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డాక్టరేట్ పట్టా ప్రకటించింది. కర్ణాటక సంగీతంలో ఆమె చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. 'శ్రీమాన్ కరి నారాయణాచార్య భాగవతార్ సంగీత రచనలు-విశ్లేషణ' అనే అంశంపై ఆచార్య శైలేశ్వరి పర్యవేక్షణలో యామినీకృష్ణ పరిశోధనా వ్యాసం సమర్పించారు. సింహాచలం సుప్రభాత రచయిత అయిన నారాయణాచార్య భాగవతార్ సంపూర్ణ సంగీత కృషిని ఈ పరిశోధన ద్వారా వెలుగులోకి తీసుకువచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్జీయూకేటీలో సంగీ త అధ్యాపకురాలిగా యామినీకృష్ణ పనిచేస్తున్నారు.

ప్రభుత్వ చొరవతో మిల్లులకు ధాన్యం



ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న దృశ్యం

జి.సిగడాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు సంభవించడంతో ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో సంబంధిత అధికారులు పర్యటించి రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని పరిశీలించి వెంటనే కొనుగోలుకు చర్యలు తీసుకుంటున్నారు. పెంట, నాగులవలస తదితర గ్రామాలలో తహసీల్దార్ ఎం.సరిత, ఏవో బెండు బాబ్జీ తది తరులు పర్యటించి రైతుల వద్ద ఉన్న ధాన్యం వివరాలు సేకరించి షెడ్యూల్, ట్రక్ షీట్ ఇచ్చి ధాన్యాన్ని మిల్లులకు పంపించేందుకు చర్యలు చేపట్టారు.

ప్రధాని మోదీతోనే సుపరిపాలన

పొందూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీతోనే దేశంలో సుపరిపాలన అందుతోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరిపురపు తేజేశ్వరరావు అన్నారు. రాపాకలో ఆదివారం ప్రధాన మంత్రి మన్‌కీబాత్ 128వ ఎపిసోడ్ ప్రసార కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గొర్లె వెంకట అప్పలనాయుడు, నాయకులు ఎల్.సింహాచలం, సురేష్‌బాబు సింగ్, పి.శ్రీనివాసరావు, బలివాడ సత్యనారాయణ, వండాన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వన విహారంతో సత్ఫలితాలు

● జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా



ఇతర న్యాయాధికారులతో కలిసి పిక్నిక్‌లో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం లీగల్ నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం పనిభారంతో ఉండే న్యాయవాదులకు వనవిహారం పేరిట కుటుంబాలు కలిసే కార్యక్రమాలు చేపట్టడం వల్ల సత్ఫలితాలు ఇస్తాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆదివారం కిల్లిపాలెం లేఅవుట్‌లో జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వన భోజనం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో 1వ, 3వ, 4వ అదనపు జిల్లా న్యాయాధికారులు పి.భాస్కరరావు, సీహెచ్ వివేకానందశ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, సీనియర్ సివిల్ న్యాయాధికారులు ఎం.శ్రీధర్, శాంతిశ్రీ, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి కె.అనురాగ్, అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి జమ్రుతబేగం, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తంగి శివప్రసాద్, పిట్టా దామోదర్, ప్రతినిధులు భవానీ ప్రసాద్, కొమ్ము రమణమూర్తి, ఆరంగి అప్పలరాజు, గేదెల వాసుదేవ రావు, సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, పొన్నాడ వేంకట రమణారావు, పుల్లెల సీతారామయ్య, రమణ దయాల్, మామిడి క్రాంతి, జల్లు తిరుపతిరావు ఎన్ని సూర్యారావు, వాన కృష్ణచంద్, ఆగూరు ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేదా?

● మండల సమావేశంలో సభ్యుల ఆవేదన



అధికారిని ప్రశ్నిస్తున్న సభ్యులు

కవిటి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేదా అని పలువురు సభ్యులు అధికారులను నిలదీశారు. ఆదివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డి.సతీష్, ఎన్పీ నారాయణస్వామి, పి.కృష్ణారావు, డి.భద్రాచలం తదితరులు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమా లకు స్థానిక ప్రజా ప్రతినిధులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని ఇది ఎంత వరకు సమంజసమని అధికారులను ప్రశ్నించారు. హౌసింగ్‌పై జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడు తూ.. గ్రామాల్లో ఒకే ఇంటి వద్ద పరిశీలన చేస్తున్నారని విమర్శించారు. సర్పంచ్, ఎంపీటీలకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయశాఖపై జరిగిన చర్చలో ఆహ్వానిత సభ్యుడు కె.ప్రకాష్, ఎంపీటీసీ పి.నీలాచలం మాట్లాడుతూ.. అన్నదాతా సుఖీభవ పథకంలో మండలంలో అందరు రైతులకు అందలేదన్నారు. కారణాలేమిటని ప్రశ్నించారు. మండలస్థాయిలో గుర్తించిన రైతులకు మాత్రమే నిధులు జమయ్యాని వ్యవసాయాధికారి పి.శ్రీదేవి తెలిపారు. కవిటి మండలంలో గతంలో జరిగిన సర్వేల్లో 2034 మందికి జాయింట్ నెంబర్లు కేటాయించడంతో కొంత ఇబ్బంది ఏర్పడిందని, ఈవిషయంలో రికార్డులు పరిశీలిస్తున్నామని తహసీల్దార్ మురళీమోహన్ తెలిపారు. సర్పంచ్ బి.శ్రీరాంప్రసాద్ మాట్లాడుతూ.. బొరివంక, బి.గొనపపుట్టుగ పంచాయతీ సచివాలయాల్లో సిబ్బంది కొరతతో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, సమస్య పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీడీవో ఎల్.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నిక



ప్రమాణం చేస్తున్న ఎస్టీయూ కార్యవర్గ సభ్యులు

గుజరాతీపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నగరంలోని దాసరి క్రాంతిభవన్‌లో ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ పట్నాయక్ ముఖ్య అతిథిగా, ఎన్నికల అధికారిగా డి.శ్యామ్ పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షుడిగా పేడాడ ప్రభాకర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా గురువు శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా కంచరాన తేజేశ్వరరావులతో సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం చేసి పలు తీర్మానాలు చేశారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించాలని కోరారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం..

పొందూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, పప్పల తిరుమలరావు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. సంఘం మండల అధ్యక్షుడిగా మొగదాల రమణరావు, ఉపాధ్యక్షులుగా ఆర్. రాఘవ నాయుడు, జి.జవహర్ గుప్తా, చింతాడ విజయబాల, దండా శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శులుగా జి.శ్రీనివాసరావు, డి.శ్రీనివాసరావు, డి.రవికుమార్, పి.రవి బాబు, రమణమూర్తి, ఎం.రోజా, పాపారావు ఎన్నికయ్యారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ కార్యవర్గ సభ్యులు

న్యూస్ బాక్స్

ఇసుక మేటల తొలగింపు



ఇసుకను తొలగిస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రణస్థలంలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పాత పోలీస్ స్టేషన్ సమీపంలో డైవర్షన్ ఇచ్చారు. రోడ్డుపై ఇసుక మేటలు తొలగించక పోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో శనివారం 'ఇరుకు దారితో ఇక్కట్లు' శీర్షికతో కథనం వచ్చింది. దీనికి సంబంధిత అధికా రులు స్పందించి ఆదివారం ఇసుక మేటలను తొలగింపు చర్యలు చేపట్టారు.

గ్రీవెన్స్‌ను వినియోగించుకోండి

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను "మీకోసం.ఏపీ.జీవీటీ.ఇన్"లో నమోదు చేసుకోవ చ్చని, అలాగే ఇప్పటికే నమోదు చేసుకున్న అర్జీల స్థితిగతులను 1100 నెంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకో వచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణంలో శ్రమదానం

సోంపేట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎర్రముక్కాం గ్రామంలో కొత్తగా నిర్మిస్తున్న నీలకంఠేశ్వర ఆలయ పనుల్లో భాగంగా గ్రామానికి చెందిన శివభక్తులు శనివారం శ్రమదానం చేశారు. పునాది తీసే పనుల్లో పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న భక్తజనం

అరసవల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. ఇంద్రపుష్కరిణిలో పవిత్ర స్నానాలు ఆచరించి, రావిచెట్టు వద్ద దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కళకళలాడాయి. ఆదివారం ఒక్క రోజు స్వామికి రూ.6,87,719 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.3,70,100, పూజలు, విరాళాల ద్వారా రూ.79,459, ప్రసాదాల రూపంలో రూ.2,37,160 ఆదాయం లభించిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష



ఇచ్ఛాపురం: స్కాలర్‌షిప్ మోడల్ పేపర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈవో విశ్వనాథం



ఆమదాలవలస: మోడల్ టెస్ట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం/ఆమదాలవలస, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం బాలికోన్నత పాఠశాల, ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్ఎంఎంఎస్ మోడల్ పరీక్ష ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో ఎస్.విశ్వనాథం, కమిషనర్ తమ్మినేని రవి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో దాగవున్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటువంటి మోడల్ పరీక్షలు దోహదం చేస్తాయన్నారు. పరీక్షలను పీఆర్‌టీయూ ప్రతినిధులు పర్యవేక్షించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమాల్లో హెచ్ఎంలు బి.శ్రీనివాసరావు, సూర్యారావు, పీఆర్‌టీయూ ప్రతినిధులు పి.చంద్రశేఖర్ రావు, కె.అప్పన్న, బొడ్డేపల్లి గోపి, కె.రామకృష్ణ, వి.గోపీకృష్ణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీచ్‌లో పర్యాటకుల సందడి

గార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొగదాలపాడు సముద్రతీరంలో ఆదివారం పర్యాటకుల సందడి కనిపించింది. కార్తీక మాసం వెళ్లిన తర్వాత కూడా రెండో ఆదివారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పలు పాఠశాలల విద్యార్థులతో పాటు కుటుంబాలు వన భోజనాలు చేసి సముద్రతీరంలో ఆటపాటలతో సందడి చేశారు. పలువురు సముద్ర స్నానాలు చేయడం జరిగింది. కళింగపట్నం మెరైన్ సీఐ బి.ప్రసాదరావు పర్యవేక్షణలో సిబ్బంది గస్తీ నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మైక్‌లో హెచ్చరికలు చేశారు.

ఇంద్ర ఏసీ బస్సు చార్జీల తగ్గింపు

● శ్రీకాకుళం నుంచి విజయవాడ ప్రయాణికులకు అవకాశం

అరసవల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం-విజయవాడ ఇంద్ర ఏసీ బస్సుల చార్జీలను 20 శాతం మేర తగ్గించినట్టు జిల్లా ప్రజా రవాణా అధికారి సీహెచ్ అప్పలనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తగ్గింపు ప్రయాణికులకు సరసమైన, అందుబాటులో ఉండే ప్రయాణాన్ని అందించే లక్ష్యంతో చేపట్టినట్టు వెల్లడించారు. ఈ తగ్గింపు ధరలు సోమవారం (డిసెంబరు 1) నుంచి 31వ తేదీ వరకు అమల్లో ఉంటాయన్నారు. ప్రస్తుతం చార్జీ రూ.928 ఉండగా 20 శాతం తగ్గింపుతో రూ.743లకే ప్రయాణించవచ్చని పేర్కొన్నారు. శ్రీకాకుళం నుంచి ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటలకు (సర్వీస్ నెంబర్ 2967), విజయవాడ నుంచి ప్రతిరోజూ రాత్రి 7.15 గంటలకు (సర్వీస్ నెంబర్ 2968) బస్సులు బయలు దేరుతాయని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

అవయవదాత పిల్లలకు చేయూత

సోంపేట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మాకన్నపురానికి చెందిన ఉలాల హిమవతి రోడ్డు ప్రమాదంలో గాయపడి జెమ్స్ ఆసుపత్రిలో గతనెల 26న బ్రెయిన్‌డెడ్ అయి మృతి చెందింది. ఈమె అవయవాలను కుటుంబ సభ్యులు ఆరుగురు వ్యక్తులకు దానం చేశారు. మృతురాలికి ఇద్దరు ఆడ పిల్లలుండగా వారి ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని గ్రామానికి చెందిన మద్దివలస నాగేశ్వరరావు (ఎమ్మెన్నార్) యువసేన సభ్యులు రూ.35,100 నగదును సర్పంచ్ నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆదివారం టీడీపీ కార్యాలయంలో అందించారు. కార్యక్రమంలో బతకల జోగారావు, నల్ల శ్యామలరావు, బతకల దీర్ఘారావు, ఉలాల హరికృష్ణ, పలువురు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వ్యక్తి హత్య దారుణం



అరసవల్లి: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నేతలు



రణస్థలం: కొవ్వొత్తులతో ప్రదర్శనలో పాల్గొన్న సీఐటీయూ ప్రతినిధులు

అరసవల్లి/రణస్థలం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో గంజాయి, డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా వివిధ కళారూపాలతో ప్రజలను చైతన్య పరుస్తున్న యువ కళాకారుడు పెంచలయ్యను హత్య చేయడం దుర్మార్గమని, నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం శ్రీకాకుళం, నగరం, రణస్థలంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ.. గంజాయి ముఠా పథకం ప్రకారం ప్రజానాట్యమండలి కళాకారుడిని కిరాతకంగా హత్య చేశారని ఆరో పించారు. పోలీసుశాఖ సహ కారంతో కూడా ఈ విషయంలో పలు చైతన్య కార్యక్రమాలు చేపట్టా దన్నారు. దోషులను తక్షణం శిక్షించాలని, అప్పుడే ఇతరులకు కనువిప్పు కలుగుతుం దన్నారు. కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నా యుడు, పి.తేజేశ్వరరావు, నాయకులు కె.శ్రీనివాస్, నాగమణి, పి.ప్రసాద రావు, ఎ.లక్ష్మి, ఆర్.ప్రకాశరావు, ఎం.గోవర్ధనరావు, సీపీఎం నాయకుడు వెలమల రమణ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి


బోల్తా పడిన ట్రాక్టర్

జలుమూరు (సారవకోట), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్నగుజ్జువాడ వద్ద జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో అలుదు గ్రామానికి చెందిన డ్రైవర్ బొల్ల లక్ష్మణరావు (35) మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు బేబీ చిప్స్ తేవడానికి సారవకోట నుంచి క్వారీకి వెళుతున్న ట్రాక్టర్ చిన్నగుజ్జువాడ సమీపంలో మలుపు వద్ద బోల్తా పడిపోయింది. ఈ సంఘటనలో డ్రైవర్ లక్ష్మణరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. భార్య నీలవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ. అనిల్ కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు. మృతుడు లక్ష్మణకు భార్య నీలవేణి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబాన్ని పోషించే యజమాని ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబాన్ని ఎలా పోషించేదని భార్య కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వలస కూలీ మృతదేహానికి అంత్యక్రియలు


మృతదేహం వద్ద గ్రామస్థులు

ఇచ్ఛాపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): డొంకూరు గ్రామానికి చెందిన బడే చంటి (21) అనే వలస కూలీ నవంబరు 24న దుబాయ్‌లో బలవన్మరణానికి పాల్పడి మృతి చెందిన సంఘటన తెలిసినదే. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించేందుకు జనసేన పార్టీ మండల నాయకులు చీకటి కృష్ణయ్య ఫోర్ జోన్ ఇండస్ట్రీస్ కంపెనీ వారితోను, ఇండియన్ అసోసియేషన్ వారితో సంప్రదించారు. కమ్యూనిటీ గల్ఫ్ కార్మికుల సమితి అధ్యక్షులు నరసింహ సాయంతో చంటి మృతదేహాన్ని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు రప్పించారు. అక్కడి నుంచి డొంకూరు గ్రామానికి ఆదివారం అంబులెన్స్‌లో తీసుకొచ్చి..అంత్యక్రియలు నిర్వహించారు. దీంతో గ్రామం అంతా శోకసంద్రంలో మునిగిపోయింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బుడ్డ రిషి, బడే రామారావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

గాయపడిన వ్యక్తి మృతి

నందిగాం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నందిగాం మండలం లట్టిగాం సమీప జాతీయ రహదారిపై నవంబరు 27న రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం రాత్రి మృతిచెందాడు. ఈ ప్రమాదంలో నలుగురికి గాయాలైన విషయం విదితమే. భామిని మండల కేంద్రానికి చెందిన బొమ్మాళి సుదర్శనరావు(42) అనే వ్యక్తి నందిగాం మండలం హరిదాసుపురం అత్తవారింటికి వచ్చేందుకు లట్టిగాంలో దిగి జాతీయ రహదారి దాటుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆయనను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందినట్లు ఎస్ఐ షేక్ మహ్మద్ అలీ తెలిపారు. ఈయనకు భార్య సరస్వతి, కుమార్తె రిషిత ఉన్నారు.

అగ్ని ప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధం


కాలిపోయిన పూరిళ్లు

జి.సిగడాం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి జాడ గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమా దంలో జరిగి రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన ఇజ్జు ఆదమ్మ, తిరుమరెడ్డి లక్ష్మీ కాంతంలకు చెందిన పూరిళ్లు కాలి బూడిద య్యాయి. గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో ఎవరూ లేరని, ఎలా ప్రమాదం జరిగిందో తెలియలేదు. విద్యుత్ మీటర్లు, వ్యవసాయ పరికరాలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఘటనా స్థలానికి రాజాం అగ్ని మాపక శకటం సిబ్బంది చేరుకొని మంటలను అదుపుచేశారు. ఈ పమాదంలో రూ.2 లక్షల వర కు ఆస్తినష్టం వాటిల్లినట్లు ప్రాథమిక అంచనా. తమది పేద కుటుంబాలని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'ప్రజాదర్బార్': మంత్రి అచ్చెన్న


ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకొని తక్షణమే పరిష్కార చర్యలు చేపట్టేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదే శించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పాలకులు ప్రజా సమస్యలను పూర్తిగా గాలికొదిలేశారని అన్నారు. అన్ని గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అర్హత ఉన్న వారికి ప్రభుత్వం నూతన పింఛన్లు, నివాసాలు మంజూరు చేస్తుందని తెలిపారు.

వైసీపీ పాలనలో పంచాయతీలు అధ్వానం

గత వైసీపీ ప్రభుత్వ పాలనలో పంచాయతీలకు చెందాల్సిన వాటాలను సైతం ఇవ్వలేదని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నిమ్మాడ జంక్షన్ నుంచి తిలారు మణికంఠ గ్రానైట్స్ వరకు రూ. 1.80 కోట్లు ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో గ్రామాల నుంచి నిధులు మళ్లించారు తప్పితే పైసా ఇచ్చింది లేదన్నారు. మరో పక్క పంచాయతీలకు కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థిక సంఘం నిధులను కూడా దారి మళ్లించారని ఆరోపించారు. ఫలితంగా పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యమయ్యే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో మౌలిక సదుపాయాలను కల్పిస్తోందని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, పీఏసీఎస్ అధ్యక్షురాలు వెలమల విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ తర్ర రామకృష్ణ, నేతలు శిమ్మ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


కోటబొమ్మాళి: గురువులను సత్కరించిన దృశ్యం

కోటబొమ్మాళి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1979వ సంవత్సరం టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 47 సంవత్సరాల తర్వాత కలుసుకున్న స్నేహితులు తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బోయిన రమేష్, సనపల కరుణ్ కుమార్, మండల విద్యాశాఖాధికారి డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

జలుమూరులో...

జలుమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికను ఆదివారం నిర్వహించారు. 35 సంవత్సరాల తరువాత వీరంతా జలుమూరు ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం కలుసుకొని చదువుకున్న రోజుల్లో చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ధవళ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

గారలో...

గార, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కె.మత్స్యలేశం పరిధిలో ఉన్న కోకావారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1987-88 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుని ఆనందం పొందారు. నాటి, నేటి పరిస్థితులను ఒకరికొకరు తెలుపుకున్నారు. ప్రతిఏటా ఆత్మీయ కలయిక ద్వారా అందరూ కలుసుకోవడం జరుగుతుందని పూర్వ విద్యార్థులు తెలిపారు.


జలుమూరులో కలుసుకున్న మిత్రులు


గారలో పూర్వ విద్యార్థులు

ఘనంగా త్రిపుర సుందరీదేవి బ్రహ్మోత్సవాలు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

పాతపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాగువాడ గ్రామంలోగల లలితా త్రిపురసుందరీదేవి ఆలయ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. సుసరాపు రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం సువర్చలా హనుమంతుని కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం శ్రీచక్రార్చన, చండీ హోమం నిర్వహించారు. అమ్మవారి గరుడ వాహనసేవ, ఉయ్యాల సేవల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌ల కోసం చోరీలు

(ఐదో పేజీ తరువాయి)

నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తుండగా అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో సీఐ పి.సూర్యనారాయణ, ఎస్ఐ నర్సింహమూర్తి వారిని ఆపి విచారించగా చోరీల విషయం బయటపడింది. బైక్‌లు, పలు ఇళ్లలో చోరీలు చేసినట్టు వారు అంగీకరించారు. లక్ష్మణరావు గ్రామంలో విద్యుత్ పనులు చేసేవాడు. ఈ క్రమంలో ఆయనకు పొరుగు గ్రామమైన చిన్న పరిచయం కావడంతో ఇద్దరూ ఆన్‌లైన్ బెట్టింగ్, పేకాటకు అలవాటుపడి డబ్బులు పోగొట్టుకున్నారు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనాలకు అలవాటు పడ్డారు. వారిద్దరినీ అరెస్టు చేశామని, పలాస కోర్టులో సోమవారం హాజరుపరుస్తామని డీఎస్పీ లక్ష్మణరావు తెలిపారు. వారి నుంచి నాలుగు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో వ్యక్తి కోసం గాలిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

'పెంచలయ్య హత్య బాధాకరం'


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కళాకారులు

కాశీబుగ్గ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్ర జలలో చైతన్యం కల్గిస్తూ సామాజిక బాధ్యత నిర్వహిస్తున్న పెంచలయ్యను హత్య చేయడం బాధాకరమని ప్రజా కళాకారులు, సామాజిక కార్యకర్తలు అన్నారు. ఆదివారం ప్రజా కళాకారుడు పెంచలయ్య హత్యకు నిరసనగా కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద కొవొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల్లూరులో పెంచలయ్య అనే ప్రజానాట్యమండలి కళాకారుణ్ణి గంజాయి ముఠా హత్య చేసిందని అన్నారు. గంజాయికి, డ్రగ్స్‌కి వ్యతిరేకంగా కళారూపాల ద్వారా ప్రచారం చేయడమే ఆయన చేసిన నేరమా అని ప్రశ్నించారు. హత్య చేసిన గంజాయి ముఠాను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్, చిట్టిబాబు, శశిధర్, నవీన్, సోమేశ్వరరావు, డిల్లేశ్వరి,హేమసుదన్, సుహాసిని పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రలతో వికాసం

పాతపట్నం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన, విహార యాత్రలు మానసిక వికాసానికి తోడ్పడతాయని హెచ్ఎం ఎస్.వైకుంఠరావు తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో విజ్ఞాన విహారయాత్రను ఆదివారం నిర్వహించారు. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ, మెట్టూరు రిజర్వాయర్, మెట్టుగూడ జలపాతం, సీతంపేట ఐటీడీఏ చిల్డ్రన్స్‌పార్క్ తదితర ప్రదేశాలను సందర్శించారు. సుమారు 60మంది విద్యార్థులు ఈ యాత్రలకు వెళ్లారు. వీరితో పాటు ఉ పాధ్యాయులు బి.భార్గవి, కె.అప్పారావు, గీతాంజలి పండా, చి న్నారావు, లావణ్య రెడ్డి, స్రవంతి, జగన్మోహనరావు, ప్రభావతి, హే మలత, సుభాషిణి, షణ్ముఖరావు, గోవిందరావు, రమ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

టెక్కలి, నవంబం 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ భవానీనగర్‌లో రహదారులు, డ్రైన్లు మంజూరు చేసినందుకు సీఎం చంద్రబాబు, మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడుల చిత్రపటాలకు ఆదివారం పాలభిషేకం చేశారు. ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి మాట్లాడుతూ ఇప్పటికే పాత జాతీయ రహదారి, సెంటర్ డివైడర్ లైటింగ్, ఫుట్‌పాత్, వాక్‌ట్రాక్, డిగ్రీ కళాశాల ప్రహరీ, ఎండల మల్లన్న ఆలయ అభివృద్ధికి మంత్రులు నిధులు మంజూరు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, రాము, పురుషోత్తం, షణ్ముఖరావు, కామేసు, కిరణ్ తదితరులు ఉన్నారు.

పట్టుశాలి సంఘం అధ్యక్షునిగా మధు

టెక్కలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మండల పట్టుశాలి సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మల్లిపెద్ది మధు, గౌరవాధ్యక్షులుగా పి.సింహాచలం, ఉపాధ్యక్షులుగా నందికేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా రవి, ప్రధాన కార్యదర్శిగా సాంబశివరావు, కోశాధికారిగా అశోక్‌కుమార్‌లను టెక్కలిలో ఎన్నుకున్నారు.

588 ఒడిశా మద్యం సీసాల స్వాధీనం

సంతబొమ్మాళి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బృందావనంలో ఒడిశాకు చెందిన 588 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు కోటబొమ్మాళి ఎక్సైజ్ సీఐ గాయత్రి తెలిపారు. గ్రామానికి చెందిన అప్పిని రవి పాకలో ఈ మద్యం పట్టుకొని కేసు నమోదు చేశామన్నారు. అప్పిన రవి కోసం గాలిస్తున్నామని తెలిపారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చినపల్లివూరు గ్రామానికి చెందిన నిమ్మాడ కామరాజు ఇటీవల మృతిచెందారు, మృతుని కుటుంబానికి ఉన్న ఆర్థిక ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని హ్యాండ్ టు గెదర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కామరాజు కుటుంబానికి రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు టి.గణపతి, సీహెచ్.ధనరాజు, జి.శేఖర్, కె.గణేష్ పాల్గొన్నారు.

పార్కింగ్ ఏర్పాటు చేయాలి

నరసన్నపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి సమయంలో లారీలను రోడ్ల పక్కన నిలుపుదల చేయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మడపాం టోల్ ప్లాజా వద్ద ప్రత్యేకంగా రాత్రి సమయంలో పార్కింగ్ స్థలం కేటాయించాలని ఉత్తరాంధ్ర లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. మడపాం టోల్‌ప్లాజా వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలిపేందుకు అనుమతి ఇవ్వాలన్నారు.

ఘనంగా గీతా జయంతి

కాశీబుగ్గ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ పదోవార్డు శివాలయం వీధిలో గల కాశీవిశ్వేశ్వర ఆలయంలో ఆదివారం గీతా జయంతిని ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు భగద్గీత కంఠస్థం, పఠన పోటీలు నిర్వహించినట్టు విశ్వహిందూ పరిషత్ సభ్యులు సాయిరాం, విజయ్‌కుమార్, చంద్రమౌళి తెలిపారు.ఈ కార్యక్రమంలో అనసూయమ్మ, గురుదేవదత్తం, రత్నాకర్, రమేష్, శివతేజ, రామానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంఘటితంగా ఉంటేనే సమస్యల పరిష్కారం

పాతపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సంఘటితంగా ఉంటేనే సమస్యలు పరిష్కరించుకోగలుగుతామని మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్వీ సత్యనారాయణ అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో సాయిదుర్గా పెట్రోల్ అండ్ డీజల్ మెకానిక్స్ వెల్ఫేర్ సంఘ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని వెల్లడించారు.

తాగునీటి పైపునకు రంధ్రం

పోలాకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వనిత మండలం తాగునీటి పథకం ద్వారా ప్రజలకు నీటి సరఫరా చేసే పైపునకు పెద్ద రంధ్రం పడడంతో తాగునీరు వృథాగా పోతోంది. ఈ విషయమై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని స్థానిక నాయకులు యోగి, రామారావు, రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులను హడలెత్తిస్తున్న తుఫాన్

నరసన్నపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో అన్నదాతలలో అలజడి పెరిగింది. కోసిన వరి పనలను కాపాడుకునేందుకు పొలాల్లోనే కుప్పలు పెడుతున్నారు. రవాణాకు అనుకూలంగా ఉన్న పొలాల నుంచి ట్రాక్టర్లు, ఆటోలతో కళ్లాలకు తీసుకువచ్చి నూర్పులు చేస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 3.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఇప్పటికే సుమారు 1.80 లక్షల ఎకరాల్లో వరికోతలు పూర్తయ్యాయి. 90వేల ఎకరాల్లో నూర్పులు జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో చేలు, ధాన్యం భద్రపరుచుకునేందుకు రైతులు పరుగులు పెడుతున్నారు. ధాన్యం బస్తాలను రోడ్ల మీద, కళ్లాల్లో జాగ్రత్త పరుస్తున్నారు. మాకివలస, సుందరాపురం, పారశెల్లి,తోటాడ, బాలసీమ, కోమర్తి, కిల్లాం, మాకివలస, జమ్ము, తామారాపల్లి, కంబకాయి తదితర గ్రామాల్లో వేలాది ఏకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. పొలాల్లో ఉన్న చేలు కాపాడుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

మెళియాపుట్టిలో..

మెళియాపుట్టి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు దిత్వా తుఫాన్ భయంతో ఆందోళన చెందుతున్నారు. గత 15 రోజులు నుంచి ముమ్మరంగా వరి కోతలు జరుగుతున్నాయి. కోత యంత్రాలు సరిగా దొరక్కపోవడం రైతులకు సమస్యగా మారింది. పొలాల్లోనే చేలు ఉండడంతో ఎలా కాపాడుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు. కొంతమంది రైతులు ధాన్యాన్ని కళ్లాల్లో ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ప్రారంభం కావటంతో రైతులు అమ్ముకోలేకపోయామని...ఇప్పుడు తడిసిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందున్నారు.

పోలాకిలో..

పోలాకి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి):వాతావరణంలో మార్పులు.. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. కొత కోసిన పంటను రక్షించుకునేందుకు పాట్లు పడుతున్నారు. బెలమర, ఈదులవలస, రాళ్లపాడు, ప్రియాగ్రహారం, దీర్ఘాశి గ్రామాలో నూర్పులు చేయించి... ధాన్యాన్ని గోనే సంచుల్లో నిల్వచేశారు. కొందరు రైతులు నిల్వచేసేందుకు గోదాంలు లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించారు.

నందిగాంలో...

నందిగాం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో పంటను కాపాడుకునే పనిలో రైతులు బిజీగా కనిపించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆకాశం మేఘావృతం కావడంతో కోసిన ధాన్యాన్ని రాశులుగా పోసి.. టార్పాలిన్లు కప్పడంతో పాటు గోనెసంచుల్లోకి ఎత్తే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. అలాగే కోసిన చేలను కుప్పలుగా పెట్టడంతో పాటు వర్షం పడితే నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

జలుమూరులో..

జలుమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ముప్పుతో రైతులు కలవర పడుతున్నారు. ఆదివారం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతం కావడంతో పంటను కాపాడుకోవడానికి కర్షకులు ఇక్కట్లు పడ్డారు. నూర్చిన ధాన్యాన్ని కళ్లాలు, రోడ్ల పక్కన ఎండబెట్టిన రైతులు వాటిని భద్రపరచుకోడానికి అష్టకష్టాలు పడుతున్నారు. ధాన్యాన్ని భద్రపరచుకోడానికి సరైన స్థలాలు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఎల్ఎన్‌పేటలో..

ఎల్.ఎన్.పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆకాశం మేఘావృతం కావడంతో అన్నదాతలు దిగులు పడుతున్నారు. వరిపంట చేతికందే సమయంలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టం జరిగితే వలసలే శరణ్యమని వివిధ గ్రామాలకు చెందిన రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. అనేక గ్రామాల్లో రైతులు కోతలుకోసి పొలాలు, కళ్లాల్లో కుప్పలు పెట్టి వాటిని కాపాడుకొనేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో రైతులు నూర్పులు చేసిన ధాన్యం రాశులపై టార్పాలిన్లు కప్పుతున్నారు.


ఎల్ఎన్‌పేట: తురకపేట సమీపంలో ధాన్యం రాశులపై టార్పాలిన్లు


జలుమూరు: ధాన్యాన్ని భద్రపరుస్తున్న రైతులు


నరసన్నపేట: జమ్ములో చేనును తరలిస్తున్న రైతులు


మెళియాపుట్టి: పట్టుపురం వద్ద ధాన్యం ఎత్తుతూ...


పోలాకి: పొలాల్లో వరి కుప్పలు


నందిగాం: ధాన్యంపై టార్పాలిన్లు కప్పుతున్న అన్నదాతలు